క్లుప్తంగా

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు నుంచి మండలంలోని స్నానాల లక్ష్మీపురం వరకు 40 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న బీటీ రోడ్డు కనెక్టివిటీ రోడ్డు పనులకు ఆదివారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు రాజశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కొణిజర్ల: రైతులకు వానా కాలం పంటలకు రైతు బంధు ఇవ్వాలని, రూ.2 లక్షలు రుణమాఫీ అర్హులందరికీ అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావులు పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్లలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పొంగులేటి స్వరాజ్యం, రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖమ్మం కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 425మంది పాల్గొని పరీక్షలు చేయించుకోగా.. వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో ఖమ్మం కిమ్స్ ఆస్పత్రి నిర్వాహకులు బీమ్ రెడ్డి బాబు రెడ్డి, చావా శివరామకృష్ణ, సునీల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పాఠశాలలో పూర్వ విద్యార్థులు

ముదిగొండ: ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

సన్మానం..

మధిర: మధిర పట్టణంలోని సామాజిక సేవకులను ఎన్నారై పుల్లఖండం శ్రేయస్ పుట్టిన రోజును పురస్కరించుకుని టీవీఎం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అనాథలకు 90 దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త పుల్లఖండం చంద్రశేఖర్, టీవీఎం వాకర్స్ క్లబ్ సభ్యులు నాగేశ్వరరావు, వ్యాపార వేత్తలు, సామాజిక సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష వితరణ

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన రిటైర్డ్ ఐబీ ఈఈ వంగరి పద్మారావు, వసంత, రాకేష్, అక్షర దంపతులు రూ.1,11,116లు ఆదివారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మల్లికార్జునశర్మ, శ్రీధర్, చంద్రారెడ్డి, నాగు, వెంకటేశ్వరరావు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ మండల మహాసభ

సత్తుపల్లి: యూటీఎఫ్ సత్తుపల్లి మండల మహాసభ సోమవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక మదర్‌థెరిస్సా పాఠశాలలో నిర్వహించబడుతుందని ఆ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులందరు హాజరు కావాలని కోరారు.

నేడు చందర్‌రావు నామినేషన్


పసుమర్తి చందర్‌రావు

కల్లూరు: ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష పదవికి కల్లూరు మండల కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు సోమవారం నామినేషన్ వేయనున్నట్లు ఆర్యవైశ్య ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు ఖమ్మం గుట్టల బజార్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యాలయం నందు వేయనున్న నామినేషన్‌కు అభిమానులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

కారేపల్లి ఆస్పత్రిలో అవస్థలు

- అందుబాటులో లేని మందులు
- పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు
- ప్రైవేట్‌ని ఆశ్రయిస్తున్న ప్రజలు
- అరకొరగా వైద్య సిబ్బంది
- తాగునీటికి అవస్థలు పడుతున్న రోగులు


మాత్రలు కోసం ఎదురుచూస్తున్న రోగులు


కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కారేపల్లి: కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. నెల రోజుల నుంచి.. జ్వరం వచ్చినా, ఒళ్లు నొప్పులు వచ్చినా.. ఆస్పత్రికి పోతే కనీసం మందు గోలీలు లేకపాయే. ఇగ.. బీపీ పెరిగినా, షుగర్ పెరిగినా.. ఆ మందులు లేకపోవటంతో.. దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ప్రజలు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. అనారోగ్యాల బారిన ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందకపోగా.. ప్రైవేట్ మందులు కొనుక్కొని ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

60వేల జనాభాకు ఒక్కటే పీహెచ్‌సీ..

సాధారనంగా 30వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండాలి. అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలి. కానీ కారేపల్లి మండలంలో 60వేల జనాభా ఉన్నా.. కేవలం ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉంది. దీనికి తోడు విస్తీర్ణంలో పెద్దదైన సింగరేణి మండలంలో కారేపల్లికి 25కిలో మీటర్ల దూరంలో చీమలపాడు, రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం, పాటిమీదిగుంపు, బోటితండా, నానునగర్‌తండా, జైత్రాంతండా, మాణిక్యారం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆ మారుమూల అటవీ గిరిజన ప్రాంతవాసులు వైద్యం చేయించుకోవాలంటే.. బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పాడాల్సివస్తుంది. గత పదేళ్ల నుంచి.. ఆయా ప్రాంతాలకు అనుసంధానంగా మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా.. హామీలకే పరిమితమైందని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

కారేపల్లి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, 5గురు హెల్త్ సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండగా.. ఖాళీగా ఉన్న ఆరు హెల్త్ అసిస్టెంట్ పోస్టులు, పీహెచ్‌సీ పరిధిలో 16సబ్‌సెంటర్లకు గాను, 6గురు రెగ్యులర్ ఎఎన్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు, పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ, ల్యాబ్ టెక్నీషియన్, గైనాకాలజిస్ట్ పోస్టుతో పాటు, రెగ్యులర్ ఫార్మసిస్టు పోస్టు సైతం ఖాళీగా ఉంది.

వెంటాడుతున్న తాగునీటి సమస్య..

ఆస్పత్రిలో ఉన్న రెండు బోర్లు అడుగంటాయి. 300 ఫీట్లు బోరు వేసినా భూగర్భజలం జాడలేకపోవటంతో ఆస్పత్రికి గ్రామ పంచాయతీ పైపులైన్ల ద్వారా అంతంతమాత్రంగా వచ్చే భగీరథ నీరే దిక్కయ్యింది. ఆస్పత్రిలో ఇతర అవసరాలకు నీరు లేకపోవటం, సిబ్బందితో పాటు, వచ్చే రోగులు సైతం ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ విషయమై గ్రామ పంచాయతీ నుంచి మరో పైపులైన్ల ద్వారా తాగునీరు ఆస్పత్రికి సరఫరా చేయించి, తాగునీటి సమస్యలు తీర్చాలని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

మందుల కొరత ఉంది..



నెల రోజుల నుంచి మందుల కొరత ఉన్న మాట వాస్తవమే.. బీపీ, షుగర్ మాత్రలతో పాటు.. జ్వరం, ఒళ్లు నొప్పుల గోలీలు లేవు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్‌ని సంప్రదిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా మందుల కొరత ఉందని, ప్రస్తుతం టాబ్లెట్లు అందుబాటులోకి వచ్చాయని, వారం రోజులు క్వారంటైన్‌లో ఉంచి ఆ తర్వాత ఆస్పత్రులకు సరఫరా చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 70నుంచి 80 ఓపీలు చూస్తున్నామని, సీజన్‌లో 100నుంచి 150వరకు ఓపీలు ఉంటాయన్నారు. మండలంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటుకై ఐటీడీఏ అధికారులకు నివేదికలు పంపించడం జరిగిందన్నారు.

– సురేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి

సమస్యల వలయంలో చెన్నూరు పశువైద్యశాల


పశువైద్యశాల ఆవరణలో నిలిచిన మురికినీరు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో గల పశువైద్యశాలలో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక వెటర్నరీ డాక్టర్ పశువైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రికి చెన్నూరు, రావికంపాడు, లింగాల, ఎర్రబోయినపల్లి తదితర గ్రామాల నుంచి పశువులను తీసుకొచ్చి ఇక్కడ వైద్యం చేస్తుంటారు. సుమారు నలభైఏళ్లక్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు వర్షపునీరు చేరి చెరువును తలపించడంతో పాటు.. దుర్గంధం వెదజల్లుతుంది. వైద్యశాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని సిబ్బంది వాపోయారు. అదే విధంగా పశువులకు వైద్య చికిత్స అందించేందుకు గాను ఉపయోగపడే ట్రైసర్లు పాడైపోయినాయి. దీంతో పశువులను తాళ్లతో కట్టి వైద్యం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం ఇకనైనా వైద్యశాలలో నీటిని నిల్వలేకుండా చూడాలని, మరమ్మతులు, తదితర వసతులు కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

దారి లేకుండా చేస్తున్నారు సారూ..


ఫెన్సింగ్ రాళ్లను చూపిస్తున్న బాధిత రైతులు రంగనాయకమ్మ, సీతారావమ్మ

చింతకాని: వారసత్వంతో వచ్చిన తమ వ్యవసాయ భూములకు రహదారి సౌకర్యం లేకుండా చేయటమే కాకుండా మాపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న రైతుపై చర్యలు తీసుకోవాలని బాధిత వృద్ధ మహిళా రైతులు కనపర్తి రంగనాయకమ్మ, బోయపాటి సీతారావమ్మ పోలీస్, రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతసాగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో 271వ సర్వేనంబర్‌లో 3.13ఎకరాలు, 272లో 7.38ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూములకు వెళ్లేందుకు పురాతన కాలం నుంచే 270లోని చెరువువైపు నుంచి రహదారి ఉంది. ఈ క్రమంలో రహదారి సౌకర్యం లేకుండా చేసేందుకు అదేగ్రామానికి చెందిన రైతు కనపర్తి గోవిందరావు ఫెన్సింగ్‌రాళ్లను ఏర్పాటుచేస్తుండగా తాము అడ్డుకోవడంతో కేసులు పెట్టి బెదిరిస్తున్నాడన్నారు. ఈ విషయమై ఇప్పటికే పెద్దలు, పోలీస్, రెవెన్యూ అధికారలకు విన్నవించామని తెలిపారు. ఇప్పటికైన రెవెన్యూ, పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమ వ్యవసాయ భూములకు రక్షణ కల్పించి న్యాయం చేయాలన్నారు.

ఓపెన్ విద్యను సద్వినియోగం చేసుకోండి


పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న గ్లోబల్ పరిశోధనా కేంద్రం సభ్యులు

కొణిజర్ల: ఓపెన్ విద్యా విధానం ద్వారా డిగ్రీలో ప్రవేశం పొంది ఉన్నత చదువులు చదువుకోవాలని గ్లోబల్ పరిశోధన కేంద్రం చైర్మన్ దుణుకు వేలాద్రి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం చిన్నగోపతిలో నిర్వహించిన కార్యక్రమంలో వేలాద్రి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో ఎదుగుతున్నప్పటికీ విద్యారంగంలో మాత్రం దేశం మిగిలిన దేశాలతో పోల్చుకుంటే బాగా వెనకబడి ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లా మహేష్, దానియేలు, నరసింహారావు, శంకర్, లక్ష్మీ, కనకారావు, ఉపేందర్, వెంకట్, వీరన్న, ఇబ్రహీం, గోపయ్య పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

కల్లూరు: కల్లూరు పెద్ద చెరువు కట్టమీద ఉన్న శ్రీ శివాంజనేయస్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం శ్రీకనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం బ్రహ్మశ్రీ కంభంపాటి అనీల్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోశ్చరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా దేవాలయంలో గణపతి పూజ, పుణ్యహవాచనం, దుర్గా మల్లేశ్వరి స్వామివార్ల శాంతి కల్యాణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన చేశారు. కార్యక్రమంలో శ్రీ శివాంజనేయస్వామి దేవాలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారావు, సూర్య నారాయణ, మాధవరెడ్డి, సత్తిరెడ్డి, రామారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండవ ఆలయంలో పూజలు

చింతకాని: మండలంలోని చిన్నమండవ గ్రామంలో ఉన్నటువంటి స్వయంభు నామాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏపీలోని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ఆదివారం పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో సంస్కృతి దీక్ష యజ్ఞం

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార్ విభాగ్ ఆధ్వర్యంలో సంస్కృతి దీక్ష యజ్ఞ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమ కార్యక్రమాలను నిర్వహించి, ఘర్‌వాపసి కార్యక్రమంలో భాగంగా 9కుటుంబాలు, 53 హిందూ బంధువులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలు, పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ జగదాంబ త్రిశక్తి పీఠం, విశ్వధర్మ పరిరక్షణ వేదిక తెలంగాణ కోశాధ్యక్షులు ఉమారెడ్డి, వెంకటేష్ జాదవ్, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, మాధవి, సుజాత, లక్ష్మయ్య, నాగేశ్వరరావు, శిరీష, బేబి, రాణి పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల నిర్ణయం అప్రజాస్వామికమే..

సత్తుపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని.. జమిలి ఎన్నికలు అప్రజాస్వామికమేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. సత్తుపల్లిలో ఆదివారం జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదరికం, నిరుద్యోగ సమస్యలను పాలకులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శిగా కొలికపోగు సర్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు బి.రాంబాబు, ఎం.రమేష్, ఎం.పాండు, విఠల్, శ్రీను, రాజబాబు, కవిత, ఎ.రామలింగేశ్వరరావు, తిరుపతిరావు, జగన్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మడుపల్లి విద్యార్థి ఎంపిక


మాగంటి మనోహర్

మధిర: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని మడుపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి మాగంటి మనోహర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తోట నర్సింహారావు తెలిపారు. పోటీలకు ఎంపికైన మనోహర్‌ను ఎంఈఓ ప్రభాకర్‌రావు, పీడీ మాధవరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అభినందించారు.

నేరెడ పాఠశాల విద్యార్థి ప్రవీణ్..


గోగుల ప్రవీణ్

చింతకాని: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని నేరెడ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి గోగుల ప్రవీణ్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భాగ్య తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. వీరికి నవంబర్ 2న మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం రాయల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, అభినందించారు.

భట్టిని కలిసిన తల్లాడ నాయకులు

తల్లాడ: ఖమ్మం ప్రజా భవన్‌లో ఆదివారం తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి మండలంలోని సమస్యలను వివరించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కటికి కిరణ్, షేక్ జమాల్.. డిప్యూటీ సీఎంను కలిసి మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


పార్టీలో చేరిన వారితో భట్టి విక్రమార్క

చింతకాని: మండలంలోని నాగులవంచలో అనంతసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి భట్టి విక్రమార్క పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వారిని అభినందించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా అన్నదానం

తల్లాడ: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌర సరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా తల్లాడలో సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ నాయకుడు గోపిశెట్టి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లాడ యూనియన్ బ్యాంక్ పక్కన ఉదయం 9 గంటలకు కేక్ కట్ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

ఆరోగ్య మెళకువలు పాటించాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని, ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా/వైరారూరల్: ప్రతీ ఒక్కరు నిత్య జీవితంలో ఎంత బీజీగా ఉన్న ఆరోగ్య మెళకువలు పాటించి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని సూచించారు. ఆదివారం వైరాలోని కామిశెట్టి కల్యాణ మండపంలో కామిశెట్టి సుబ్బారావు (ఫ్రీడమ్ ఫైటర్) ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామిశెట్టి వెంకట కృష్ణారావు జ్ఞాపకార్థం ఆయన తమ్ముళ్లు రాజారావు, రవికుమార్.. డాక్టర్ మాచినేని రామకృష్ణతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సును ఆమె జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. డాక్టర్ మాచినేని జనరిక్ మందులు లేకుండా ఎంతో మంది ప్రాణాలు కాపాడినట్లు వివరించారు. క్రమం తప్పకుండా జిమ్‌లో వ్యాయమం చేస్తానన్నారు.

వంటిల్లే వైద్యశాల.. ఇల్లాలే వైద్యురాలు

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఆసుపత్రిలో వైద్యులు ఇచ్చే అనవసరమైన మందులు వాడకుండా వంటిల్లే వైద్యశాల.. ఇల్లాలే వైద్యురాలు అనే నినాదంతో డైట్‌ను అనుసరించి రోగాలను నివారించుకోవాలని ప్రకృతి ప్రేమికుడు, డైట్ గురు డాక్టర్ మాచినేని రామకృష్ణ తెలిపారు. ఉచిత ఆరోగ్య అవగాహన సదస్సులో భాగంగా అధిక బరువు, డయాబెటిస్, బీపీ. థైరాయిడ్, పీసీఓడీ సంతానలేని, ఆస్.ఫాటీలివర్, కిడ్నీ స్టోన్స్, మైగ్రేన్, గురక, స్పాండిలైటిస్, కేన్సర్, జాయింట్ పెయిన్స్ తదితర దీర్ఘకాలిక వ్యాధులు సోకే లక్షణాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్కెఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, తెలంగాణ రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయకుడు సత్యనారాయణ, రంగారావు, వెంకటనర్సిరెడ్డి, హరినాథ్, నర్సింహారావు, అశోక్, ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

త్వరలోనే షాదీఖానా పూర్తి చేస్తాం


జామెమసీద్ కమిటీతో ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సత్తుపల్లి జామెమసీద్, మార్కెట్ కమిటీ సదర్‌గా ఇటీవల నూతనంగా ఎన్నికైన షేక్ నాయబ్ రసూల్, జనరల్ సెక్రటరీ ఎండి కమల్‌పాషాలను ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలోనే నూతన షాదీఖానాను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలీ, ఎండీ షాకీర్, ముస్తాఫా, ఆదిల్‌షరీఫ్, మోనార్క్ రఫీ, యూనిస్, బుడేన్, భాషావలీ, ఎస్‌కె రఫీ, అమీర్‌జాని, మున్వర్ హుస్సేన్, మన్సుర్‌అలీ, జియా పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

కారేపల్లి: బహుజనుల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర శ్రీను అన్నారు. ఆదివారం కారేపల్లి బస్టాండ్ సెంటర్లో గౌడ జనహక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కారేపల్లిలో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌లో మండల సదస్సు నిర్వహించి మాట్లాడారు. సర్ధాయి సర్వాయి పాపన్న గౌడ్ మార్గంలో గౌడ జనులు పోరాడిల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులకు చంద్రయ్య, శ్రీను, లక్ష్మణ్, రామారావు, రమేష్ గౌడ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి


మండల కమిటీ అధ్యక్షుడు రాముకు నియామకపత్రం అందజేస్తున్న కృష్ణారావు, నాసరయ్య

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని సువర్ణాపురంలో జిల్లా సంఘం అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ ఇస్తానని తమ మేనిఫెస్టోలో ప్రకటించి కాంగ్రెస్ పార్టీ ఆ విషయాన్ని విస్మరించిందన్నారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. అధ్యక్షుడిగా చిరుమర్రికి చెందిన గాలి రాము, కార్యదర్శిగా వల్లబికి చెందిన సంగీతరావును ఎన్నికయ్యారు. నాయకులు శ్రీనివాసరావు, నరేందర్, పద్మాచారి, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

- తల్లాడ: తల్లాడ అంబేడ్కర్ భవన్‌లో రావుల గోపయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఉద్యమ కారుల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోదుగు ఆశీర్వాదం మాట్లాడారు. ఉద్యమకారుల ఫోరం తల్లాడ మండల నాయకులు వెంకటనారాయణ, లాలయ్య, వెంకటేశ్వర్లు, ఎక్కిరాల బాబు, మహిళా కన్వీనర్ గొల్లమందల పద్మ, అరుణ, గొడ్ల భారతి, రుక్మిణి పాల్గొన్నారు.